సాక్షి
జోగుళాంబ గద్వాల
శనివారం ၊ 15 ၊ ఏప్రిల్ ၊ 2023



నిబంధనలు తుంగలో తొక్కి
జడ్చర్లలో డీటీసీపీ లే అవుట్‌ను కచ్చ లే అవుట్‌గా మార్చుతున్నారు.
వివరాలు IIలో ▸



రహదారులు రక్తసిక్తం
ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు.
వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
41.2 /28.1
వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది.
మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.
సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

ఇఫ్తార్ 6-38
(శనివారం సాయంత్రం)
సహర్ 4-39
(ఆదివారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో లక్కీడిప్‌పై మాక్‌డ్రిల్



గద్వాల రూరల్: డబుల్ ఇళ్లకు సంబంధించి శనివారం గద్వాల పట్టణంలో లక్కీడిప్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులకు లక్కీడిప్ విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని, పట్టణంలోని 37వార్డుల పరిధిలో గుర్తించిన 3,171మంది అర్హులైన లబ్ధిదారులకు లక్కీడిప్ ద్వారా ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, ఆర్డీఓ రాములు పాల్గొన్నారు.

మతాలు వేరైనా దేవుడొక్కడే..



గద్వాల: సమాజంలో ఎన్ని మతాలున్నా అందరి దృష్టిలో దేవుడు ఒక్కడేనని, మానవులంతా సమానమేనని, ఆ దృష్టితో అందరూ సోదరభావంతో మెలగాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కౌన్సిలర్ పాండు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరయ్యారు. ముస్లింతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్వాల సర్వమత సమైక్యతకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అని పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గద్వాల క్రైం: మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం గద్వాల ట్రాఫిక్ వింగ్ కార్యాలయంలో మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నిబంధనాలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని, వాహనాదారుడు లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర ధ్రువపత్రాలు వాహనం నడిపే సమయంలో వద్ద ఉంచుకోవాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, ట్రిబుల్ రైడింగ్ చేయవద్దన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అంతకు ముందు మద్యంతాగి వాహనాలు నడిపితే జరిగే నష్టాలపై చిత్రీకరించిన వీడియోను కౌన్సెలింగ్‌లో భాగంగా వారికి చూయించారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

లింగాల: మహబూబ్‌నగర్ ఈస్ట్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆర్‌సీఓ వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో 3 వేల మంది, వనపర్తి జిల్లాలోని 3 కేంద్రాల్లో 1,428 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని ఆమె కోరారు.

సొంతిళ్లు కొందరికే..

771 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు.. 3,171 మంది అర్హులు



గద్వాలలో క్షేత్రస్థాయిలో పునఃవిచారణ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు (ఫైల్)

సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల. అందులోనూ రెక్కాడితే డొక్కాడని పేదలకు సొంతింటి నిర్మాణం గగనమే. ఎన్నికల సమయంలో నేతలు డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని చెప్పడంతో ఎన్నో పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. కానీ.. ఆ కల నెరవేరుతుందా.. లేదా అన్నది సంశయంగానే మిగిలిపోయింది. గద్వాలలో అర్హులైన పేదలు 3వేలకుపైగా ఉండగా.. పూర్తయిన ఇళ్లు మాత్రం 771 మాత్రమే ఉన్నాయి. ఈ ఇళ్లను శనివారం లక్కీడిప్ ద్వారా కేటాయించనున్నారు. అంటే సొంతింటి కల కొందరికి నెరవేరనుండగా.. మిగతా వేలాది కుటుంబాల్లో తీవ్ర నిరాశ మిగల్చనుంది. వారికి ఎలాంటి న్యాయం చేకూర్చుతారన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది.

- నేడు గద్వాలలో లక్కీడిప్ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు
- కొందరినే వరించనున్న అదృష్టం
- మిగతా 2,400 మంది అర్హులకు తప్పని ఆశాభంగం

దరఖాస్తుల వివరాలిలా..

మొత్తం డబుల్ బెడ్‌రూం ఇళ్లు	1,275
కోర్టు పరిధిలో ఉన్నవి	504
ప్రస్తుతం లక్కీడిప్ తీసే ఇళ్లు	771
మొత్తం వచ్చిన దరఖాస్తులు	5,155
తిరస్కరణకు గురైనవి	1984
లక్కీడిప్‌లో పాల్గొనే అర్హులు	3,171

గద్వాల రూరల్: గద్వాలలో పేదోడి సొంతింటి కలకు బ్రేకులు పడుతూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో నేతలు ఇచ్చిన హామీలను నమ్మి 3,171మంది పేదలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వీరిలో కేవలం 771 మందికి మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు దక్కనుండగా మరో 2,400 మంది అర్హులకు నిరాశే ఎదురుకానుంది. ఎనిమిదేళ్ల క్రితం నేతలు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం హామీలు వాస్తవ రూపం దాల్చడానికి నిర్మాణంలో చోటుచేసుకున్న జాప్యం ప్రధాన కారణమైతే.. తాజాగా పూర్తయిన ఇళ్లకు కూడా కోర్టు కేసు అడ్డుపడడంతో 771 ఇళ్లకు మాత్రమే మోక్షం లభించింది. మరో 504ఇళ్లకు బ్రేకులు పడ్డాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్యతో పోల్చితే క్షేత్రస్థాయిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సంఖ్యకు భారీ వ్యత్యాసం ఉంది.

నాయకుల హామీలు..

గత ఎన్నికల సమయంలో అధికార పార్టీకి చెందిన నేతలు అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు ఉచితంగా ఇస్తామని నమ్మబలికారు. అంతటితో ఆగకుండా పరమాల వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ స్థలం వద్దకు గద్వాల పట్టణంలోని వార్డు ప్రజలను వాహనాలలో తరలించి అక్కడ నిర్మిస్తున్న ఇళ్లను మీకే ఇప్పిస్తాం.. ఇంకా ఎక్కువ సంఖ్యలో కడుతున్నామని ప్రజలకు ఆశలు రేపారు. దీంతో నమ్మిన ప్రజలు ఆ పార్టీకి అధికారం కట్టబెట్టారు.

3,171మంది అర్హులు

మొత్తం 5,155 దరఖాస్తులలో పునఃవిచారణ జరిపిన అధికారులు చివరగా 3,171మంది దరఖాస్తుదారులు అర్హులుగాను, మిగిలిన 1984 దర ఖాస్తులను తిరస్కరించారు. ఇక 3171 మందికి 771 డబుల్ బెడ్రూం ఇళ్లను రిజర్వేషన్ ప్రాతిపదికన ఈనెల 15వ తేదీన లక్కీడిప్ ద్వారా కేటాయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, లక్కీడిప్‌లో పేర్లు రాని 2400 మంది అర్హులకు సొంతిళ్ల కలగానే మిగిలిపోనుంది.

అర్హులందరికీ ఇళ్లు కేటాయించేలా చర్యలు



డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపాం. ఇందులో 3,171మంది అర్హులుగా ఉన్నట్లు గుర్తించాం. వీరికి లక్కీడిప్ ద్వారా 771డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తాం. మిగిలిన 2,400 మందికి కోర్టు కేసు క్లియర్ అయిన తరువాత 504ఇళ్లను కేటాయిస్తాం. ఇంకా మిగిలిపోయిన అర్హులకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు కేటాయించేలా చర్యలు చేపడతాం.
– వల్లూరు క్రాంతి, కలెక్టర్



గద్వాలలోని డబుల్‌బెడ్రూం ఇళ్లు

దరఖాస్తుల వెల్లువ.. తప్పుల తడకగా విచారణ

గత ఎన్నికల సమయంలో నిర్మాణంలో ఉన్నాయని చూపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు నత్తనడకన సాగుతూ.. సుమారు నాలుగున్నరేళ్లకు పూర్తయ్యాయి. అయితే మొత్తం 1275 డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తి కాగా వాటిలో కూడా కోర్టు కేసు పేరిట 504 ఇళ్లకు బ్రేకులు పడ్డాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హులైన పేదల నుంచి అధికారులు గతేడాది రెండు విడతలుగా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 4,137 దరఖాస్తులు రాగా వాటిని క్షేత్రస్థాయిలో అధికారుల బృందాలు వెళ్లి విచారణ జరిపాయి. అయితే వచ్చిన దరఖాస్తులలో కేవలం 1,366 మంది మాత్రమే అర్హులున్నట్లు, మిగిలిన 2,771 మంది అనర్హులుగా ప్రకటించి మార్చి 25వ తేదీన గద్వాల పట్టణంలో వార్డు సభలు నిర్వహించే ప్రయత్నం చేశారు. అయితే అధికారులు చేపట్టిన విచారణ మొత్తం తప్పుల తడకగా ఉందని తమకు ఎలాంటి సొంతిళ్లు లేనప్పటికీ మమ్మల్ని ఎలా అనర్హులుగా ప్రకటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా టేబుళ్లు, టెంట్లు ఎత్తేసి అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ గందరగోళ పరిస్థితిలో వార్డు సభలు ఆగిపోయాయి. ఈక్రమంలో అర్హులైన వారినుంచి అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. గతంలో కంటే ఈసారి మరిన్ని ఎక్కువగా మొత్తం 5,155 దరఖాస్తులు వచ్చాయి. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పకడ్బందీగా విచారణ జరిపారు. ఏకంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియను నేరుగా వెళ్లి పరిశీలించారు.

దార్శనికుడు బాబా సాహెబ్ అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

- జిల్లాలో ఘనంగా జయంత్యుత్సవాలు
- అందరికీ స్ఫూర్తి ప్రదాత : జెడ్పీచైర్‌పర్సన్ సరిత
- ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం : కలెక్టర్ వల్లూరు క్రాంతి
- గొప్ప సంఘ సంస్కర్త: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి దేశంలోనే ఉన్నతవిద్యను అభ్యసించిన తొలి భారతీయుడు అంబేడ్కర్ అని, కుల, వర్ణరహిత సమాజం కోసం తన జీవితాన్నే త్యాగం చేసి మహనీయుడన్నారు. అంతటి స్ఫూర్తిప్రదాత జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రతిబింబించేలా హైదరాబాదులో ప్రభుత్వం 125అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అదే విధంగా జడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, ఆర్డీఓ రాములు, రమేష్‌బాబు, సరోజ, ఆర్ మోహన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, రామాంజనేయులు, వెంకట్రాములు, రమాదేవి, జయశ్రీ,అనిత, ఆనంద్, కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు మోహన్, శంకర్, మధుసూదన్‌బాబు, వెంకట్రాములు, రహమాన్.. అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు.

జిల్లా కార్యాలయాల్లో..

గద్వాల క్రైం: ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏఆర్ డీఎస్పీ ఇమ్మానేయేల్ పూలమాల వేసి నివాళుర్పించారు. రవాణాశాఖ, అగ్నిమాపక, ఎక్సైజ్ కార్యాలయాల్లో అధికారులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

రాష్ట్రంలో పేదల బతుకులు మారలే..



ఉదండాపురంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నో కళలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల బతుకులు నేటికి మారలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఇటిక్యాల మండల కేంద్రంతో పాటు ఉదండాపురంలో విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్రను ఆయన ప్రారంభించారు. షాబాద్, సాతర్ల, వావిలాల గ్రామాలను సందర్శించి ఆయా ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బంగారు తెలంగాణలో పేదల బతుకులు ఎందుకు మారడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఎంతకాలం నిరుపేదలు కూలీ పనులు చేస్తూ బతకాలని ప్రశ్నించారు. పేదల బతుకులను మార్చకుండా పాలకులు అంబేడ్కర్ విగ్రహాలు పెట్టుకోమని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలు పెట్టడం మాత్రమే కాదని ఆయన చెప్పిన మాటలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అందరిని సమానంగా చూడాలన్నారు. కానీ కేసీఆర్ కనీసం ఎవరిని కూడా తన ఇంటికి రానీయరన్నారు. పాలకులు ఇలా చేస్తే మహనీయుడి ఆశయాలు ఎలా నెరవేర్చినట్లని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు లేవన్నారు. అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టిన సర్పంచ్‌లకు సక్రమంగా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రూప్–1 పేపర్ లీకేజీ గురించి మాట్లాడాలని, గ్రూప్–1లో టాపర్ ఎవరో వారికి ఎన్ని మార్కులు వచ్చాయో నిరుద్యోగులకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఎం.జీ కృష్ణ, వెంకట్‌రెడ్డి, మణికుమార్, రాంబాబు, సురేష్, మధుగౌడ్, కనకంబాబు, తిరుపాల్ ఉన్నారు.

దేవుడికి దిక్కెవరు?

- నల్లమలలో ధ్వంసమవుతున్న పురాతన ఆలయాలు, విగ్రహాలు
- గుప్తనిధుల నిధుల పేరిట యథేచ్ఛగా తవ్వకాలు
- ఉమామహేశ్వరంలో అమ్మవారి రాతి విగ్రహం మాయం
- ఇప్పటికే ఆనవాళ్లు లేకుండాపోయిన ప్రతాపరుద్రుడి కోట
- టోల్ వసూళ్లపైనే అటవీశాఖ అధికారుల దృష్టి





'శ్రీశైల క్షేత్రానికి ఉత్తరద్వారంగా విరాజిల్లుతున్న ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలోని పురాతన అమ్మవారి విగ్రహం మంగళవారం మాయమైంది. ఆలయం నుంచి పాపనాశనం వెళ్లే దారిలో నాగులకట్ట వద్దనున్న పురాతన విగ్రహాల్లోని అమ్మవారి విగ్రహాన్ని దుండగులు మాయం చేశారంటూ ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇక్కడే కాకుండా నల్లమలలోని ఆలయాల్లో పలుమార్లు గుప్తనిధుల పేరుతో దుండగులు తవ్వకాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదు.'



గుప్తనిధుల కోసం జరిపిన తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోయిన అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులోని నవనారసింహ ఆలయం

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలో గుప్తనిధుల వేట విచ్చలవిడిగా సాగుతోంది. తరుచుగా ఆలయాల్లోని పురాతన విగ్రహాలు మాయమవుతున్నాయి. గుప్తనిధుల తవ్వకాల్లో విలువైన విగ్రహాలు ధ్వంసమై ఆలయాల ఆనవాళ్లే లేకుండా పోతున్నాయి. తాజాగా నల్లమలలోని ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలోని పురాతన విగ్రహం అపహరణకు గురికావడం కలకలం రేపుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయంలోనే విగ్రహాలకు రక్షణ లేకపోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ అమ్రాబాద్ మండలం మన్ననూర్ సమీపంలోని ప్రతాపరుద్రుడి కోట వద్ద ఐదుగురు వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలకు ప్రయత్నించడం సంచలనం సృష్టించింది. ఇప్పటికే ప్రతాపరుద్రుడి కోట పరిసరాల్లో పలుమార్లు తవ్వకాలతో సమీప ప్రాంతమంతా ఆనవాళ్లను కోల్పోయింది. ప్రతాపరుద్రుడి కోట గుర్తులు కూడా లేకుండా పెద్ద ఎత్తున తవ్వకాలు జరిగాయి. నల్లమలలోని ఇతర ఆలయాల్లో తరుచుగా గుప్తనిధుల వేట కొనసాగుతుండగా.. అటవీ శాఖ మాత్రం టోల్ వసూళ్లపైనే దృష్టిపెడుతూ.. పరిరక్షణ చర్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచ్చలవిడిగా తవ్వకాలు..

నల్లమల అటవీ ప్రాంతంలోని పురాతన ఆలయాలను ఎంచుకుని పక్కా ప్లాన్‌తో దుండగులు తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఎన్నిసార్లు పట్టుబడిన తిరిగి తవ్వకాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో మన్ననూర్ సమీపంలో హైదరాబాద్– శ్రీశైలం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రతాపరుద్రుని కోట వద్ద ఐదుగురు వ్యక్తులు తవ్వకాలకు యత్నించారు. ఈ కోటకు వెళ్లే మార్గంలో అటవీశాఖ గేటును సైతం ఏర్పాటు చేసింది. అనుమతి లేనిదే ఈ మార్గం నుంచి లోనికి ప్రవేశం ఉండదు. అయితే అధికారుల కళ్లుగప్పి కోట ప్రాంతంలోకి రెండు బైకుల్లో చేరుకుని తవ్వకాలకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అమ్రాబాద్ మండలం రామచంద్రయ్యతోపాటు వంగురోనిపల్లికి చెందిన రామాంజనేయులు, దేవరకొండకు చెందిన చంద్రయ్య, భూత్పూర్‌కు చెందిన కృష్ణయ్య, మహబూబ్‌నగర్‌కు చెందిన చంద్రమౌళిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఏడాదిన్నర క్రితం అమ్రాబాద్ మండలంలోని రాయలగండిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఉన్న పురాతన రాతి శిల్పాన్ని డ్రిల్లింగ్ మిషన్‌తో తవ్వి మరీ శిల్పంలోని పద్మాన్ని ఎత్తుకెళ్లారు. రెండేళ్ల కిందట కూడా ఇదే ఆలయంలో తవ్వకాలకు యత్నించి ప్రజలను చూసి పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం తరుచుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఫలితంగా అపురూపమైన ఆలయాలు, విగ్రహాలు ధ్వంసమవుతున్నాయి.

ముప్పు ముంగిట..

నల్లమలలోని ఆలయాలతో పాటు జిల్లాలోని పలు పురాతన ఆలయాల్లో సైతం తవ్వకాలు చోటుచేసుకుంటున్నాయి. శైవక్షేత్రాలకు ప్రసిద్ధిచెందిన నల్లమలలో శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా వెలుగొందుతున్న ఉమామహేశ్వర క్షేత్రం, మద్దిమడుగు, సలేశ్వరం, లొద్దిమల్లయ్య, అప్పాపూర్ పెంట, బౌరాపూర్ వద్ద ఉన్న భ్రమరాంబిక ఆలయాలు ప్రధానమైనవి. ఈ ఆలయాలతోపాటు నల్లమలలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కూడా తవ్వకాలు వెలుగుచూశాయి. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులోని నవనారసింహ ఆలయంలో తరుచుగా గుప్తనిధుల వేట సాగుతోంది. ఇప్పటికే ఇక్కడ ఉన్న తొమ్మిది విగ్రహాల్లో నాలుగు ధ్వంసమవగా.. మిగతావి ఎలాంటి రక్షణ లేక ప్రమాదపు అంచున ఉన్నాయి.

నిరంతరం తనిఖీలు

నల్లమలలో చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఫారెస్టు బీట్ ఆఫీసర్ల ద్వారా అన్ని బీట్లలో పర్యవేక్షణ కొనసాగుతోంది. అనుమానిత వ్యక్తులు, కదలికల సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం. గతంలో మన్ననూర్ వద్ద తవ్వకాలకు ప్రయత్నించిన వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నాం. వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, తెలంగాణ అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశాం.
– రోహిత్, డీఎఫ్‌ఓ

ఇవిగో ఘటనలు..



లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో డ్రిల్లింగ్‌తో పద్మాన్ని తొలగించిన దుండగులు (ఫైల్)

- 2019 ఆగస్టు 10న రాయలగండి ఆలయ సమీపంలో గుప్త నిధుల కోసం అన్వేషిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మన్ననూర్ వద్ద దుండగులతో పాటు కారు, గుప్తనిధుల అన్వేషణ కోసం తెచ్చుకున్న పరికరాలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.
- 2019 నవంబర్ 20న పదర మండలంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి ఎదురుగా ఉన్న అగ్నిగుండంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు.
- 2020 ఫిబ్రవరి 11న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని భౌరాపూర్ భ్రమరాంబిక ఆలయంలో గుప్తనిధుల తవ్వకాలు జరిగాయి.
- గతేడాది అక్టోబర్‌లో లక్ష్మీచెన్నకేశవ ఆలయంలోదుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు.

క్లుప్తంగా

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య

జడ్చర్ల: భార్యతో గొడవ పడిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక జౌకీనగర్‌లో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గాలిగౌడెంకు చెందిన చిన్నపాగ బీచుపల్లి(36) తన భార్య అలివేలు, పిల్లలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం పట్టణానికి వచ్చారు. నిత్యం మద్యం తాగి భార్య, పిల్లలతో గొడవ పడగా గురువారం రాత్రి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో పిల్లలు పక్క ఇంటిలో పడుకుని శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. తండ్రి ఉరేసుకుని కనిపించడంతో విషయాన్ని తాత బాలమైసయ్యకు ఫోన్ చేసి చెప్పారు. బాలమైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

నవాబుపేట: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా బోమ్మనిపాడుకు చెందిన పెంటప్ప(26) మూడేళ్ల క్రితం మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన స్వాతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గతేడాది బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి నారాయణపేటకు వచ్చారు. ఈక్రమంలో గొడవ పడి కొన్ని రోజుల క్రితం భార్య యన్మన్‌గండ్లకు వచ్చింది. గురువారం తన భార్యను తీసుకుని వస్తానని చెప్పి నారాయణపేట నుంచి బయలుదేరాడు. యన్మన్‌గండ్లలో భార్యతో మాట్లాడాడు. గ్రామ పెద్దలు రెండు, మూడురోజుల్లో భార్యను పంపిస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. గురువారం రాత్రి ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాల ఆవరణలో మృతుడిని చూసిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి భగవతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


లచ్చమ్మ(ఫైల్)

లింగాల: మండలంలోని దత్తారం చెందిన మార్కం లచ్చమ్మ(102) శుక్రవారం మృతి చెందింది. ఈమె ఎలాంటి రోగాలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. 50 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కోస్గి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పీసీతండాకు చెందిన అంగూర్ నాయక్(22) తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరిగానే జీవనం కొనసాగిస్తున్నాడు. పెళ్లి చేసేందుకు సొంత వారు ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. ఈ క్రమంలో 12న ఇంట్లో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిబంధనలు తుంగలో తొక్కి..

- డీటీసీపీ స్థానంలో కొత్తగా కచ్చ లేవుట్
- వెడల్పు తగ్గిన రోడ్లు, కమ్యూనిటీ స్థలాలు, ప్లాట్ల కుదింపు
- దర్జాగా మార్పులు, చేర్పులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


వివాదాస్పదంగా మారిన వెంచర్ భూమి

జడ్చర్ల: ఇష్టారాజ్యంగా ఏర్పాటవుతున్న కచ్చ లే అవుట్‌లను రద్దు చేసి నిర్ణీత విశాలమైన రోడ్లతో పాటు కమ్యూనిటీ స్థలాలను విడిచి మొక్కల పెంపకం, తాగునీరు, డ్రైయినేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనతో కూడిన డీటీసీపీ లేఅవుట్‌లను మాత్రమే అనుమతించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే కొందరు అక్రమార్కులు తమ సొంత ప్రయోజనాల కోసం డీటీసీపీగా ఉన్న లేఅవుట్‌ను సైతం ఏమార్చి దాని స్థానంలో కచ్చ లే అవుట్‌ను తయారు చేసి ప్రభుత్వ నిబంధనలను పాతరేస్తున్న సంఘటన జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. అటు అధికారులు, ఇటు పాలకుల కనుసన్నల్లో ఇదంతా జరుగుతున్నా తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దశాబ్దాల కిందటే..

బాదేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో దశాబ్దాల కిందటే కచ్చ లేఅవుట్‌లు అమలు జరుగుతున్న కాలంలోనే పట్టణ శివారులో డీటీసీపీ అనుమతులతో ఓ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇదే లేఅవుట్‌ను తాజాగా వెంచర్ యజమానులు మార్పులు చేర్పులు చేసి కచ్చ లేఅవుట్‌గా మార్చారు. దీంతో డీటీసీపీ లేఅవుట్‌లో ఉన్న నిబంధనలు తుంగలో తొక్కి 40, 33 అడుగుల వెడల్పు ఉన్న రోడ్లు 30, 25 అడుగుల మేరకు కుదించుకుపోవడంతోపాటు కమ్యూనిటీ అవసరాలకు విడిచిన స్థలాలు కూడా కనుమరుగయ్యాయి. ఇక ప్లాట్ల సైజులు కూడా పొడవు, వెడల్పు తగ్గి 200 చ.గ.,ల నుంచి 150 చ.గ., లకు చేరుకున్నాయి.


డీటీసీపీ లేఅవుట్‌ను ఏమార్చి కొత్తగా రూపొందించిన కచ్చ లే అవుట్

ఇలా జరుగుతుంది..

వెంచర్‌ను ఏర్పాటు చేసిన వారు తమకు వ్యతిరేకంగా కోర్టులో దాఖలైన కేసు విచారణ ఎదుర్కొన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు న్యాయ విచారణ కొనసాగిన తర్వాత వెంచర్ యజమానులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొంటూ వెంచర్ భూమిని స్వాధీనపర్చుకునేందుకు ఇటీవల ప్రయత్నించారు. దీంతో కోర్టులో సదరు భూమిపై హక్కులు ఉన్నాయని పేర్కొంటూ దావా వేసిన వారు అడ్డుకున్నారు. దీంతో వెంచర్ యజమానులు పోలీసులను ఆశ్రయించి వారి సహకారంతో భూమిని స్వాధీనపర్చుకున్నారు. తదుపరి డీటీసీపీ లే అవుట్‌ను ఏమార్చి కచ్చ లేఅవుట్‌ను రూపొందించి అమలు పరిచేందుకు రంగం సిద్ధం చేసి వెంచర్‌లో పనులను మొదలుపెట్టారు.

ఎందుకు మార్చారంటే..

డీటీసీపీ లేఅవుట్‌ను ఎందుకు మార్చారని వెంచర్ నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకు కోర్టు విచారణ ఎదుర్కొనేందుకు ఖర్చులు అయ్యాయని కోర్టు ఖర్చులను రాబట్టుకునేందుకు లేఅవుట్‌ను మార్చాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. కాగా ప్లాట్లను విక్రయించి రిజిస్ట్రీ చేసే సమయంలో సదరు ప్లాటుకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా తమ సొంత ఖర్చులను భరించి పరిష్కరిస్తామని దస్తావేజులలో పేర్కొన్నామని గుర్తు చేస్తున్నారు.

పట్టింపు లేని అధికారులు

వెంచర్ల ఏర్పాటు, నిబంధనలను తూ.చ అమలు చేయాల్సిన మున్సిపల్ అధికారులు ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించి డీటీసీపీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదీ జరిగింది..

బాదేపల్లి శివారులో క్లబ్ రోడ్డు పరిధిలో సర్వే నం.18/2,18/3లలో గల 26.39 ఎకరాల భూమిని 1990- 91 సంవత్సరాల్లో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి 1992లో డీటీసీపీ నుంచి అనుమతులు కూడా పొందారు. ఎల్‌పీ నంబర్ 53/92 డీటీసీపీ లేఅవుట్ అనుమతుల ప్రకారం మొత్తం 26.39 ఎకరాల విస్తీర్ణంలో 5శాతం చొప్పున కమ్యూనిటీ అవసరాల నిమిత్తం 1.32 ఎకరాలు కేటాయించారు. ఇక అంతర్గత రహదారులకు సంబంధించి 9.35 ఎకరాలు కేటాయించారు. మిగతా విస్తీర్ణంలో 200 చ.గ.,లతో 336 ప్లాట్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు విక్రయించి రిజిస్ట్రీ చేశారు. అయితే సదరు వెంచర్ చేసిన భూమి ప్రభుత్వానికి సంబంధించిన భూమిగా పేర్కొంటూ ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో వివాదం తలెత్తింది. దీనికి తోడు భూమి యజమానుల సంతతికి చెందిన కొందరు కూడా వెంచర్ భూమిపై తమకు హక్కు ఉన్నాయని పేర్కొంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో వెంచర్‌లో తదుపరి ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతోపాటు నిర్మాణాలకు అనుమతులు నిలిచిపోయాయి.

నోటీసులు ఇచ్చాం..



డీటీసీపీ లే అవుట్‌ను ఏమార్చి నిబంధనల ఉల్లంఘనపై వెంచర్ యజమానులకు నోటీసులిచ్చాం. నిబంధనల ఉల్లంఘనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అంతేగాక వెంచర్‌లో ఇళ్ల నిర్మాణాలకు ఎట్టి పరిస్థితిలో అనుమతి ఇచ్చేది లేదు.

– మహ్మద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

చట్టబద్ధంగానే..



ప్రభుత్వ నిబంధనల మేరకు చట్టబద్ధంగానే వ్యవహరిస్తాం. వెంచర్‌కు సంబంధించి దశాబ్దాల తరబడి కోర్టులో కేసుల విచారణ ఎదుర్కొన్నాం. ఇందుకు భారీగా ఖర్చు చేయాల్సి వచ్చింది. వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి న్యాయం చేసేందుకు మా భాగస్వాములతో కలిసి చర్చించి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మయ్య, వెంచర్ నిర్వాహకుడు, జడ్చర్ల

విచారించి చర్యలు..



డీటీసీపీ లే అవుట్‌ను మార్చి కచ్చ లే అవుట్‌ను రూపొందించడం చట్టవిరుద్ధం. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. వెంచర్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు మేరకు వ్యవహరించాలి. వెంచర్‌ను అనుసరించి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై కూడా విచారించాల్సి ఉంది.

– లక్ష్మి, చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ

భూగర్భ కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు


సీఈకి అగ్నిప్రమాద నివారణ పరికరాల వివరాలు తెలుపుతున్న ఫైర్ ఆఫీసర్

దోమలపెంట(అచ్చంపేట): జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం శ్రీశైలం భూగర్భ విద్యుత్ కేంద్రంలో ఇన్‌చార్జ్ సీఈ ఆదినారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలి రోజు వారోత్సవాలకు సంబంధించిన బ్యానర్లను, ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది అగ్ని ప్రమాదం నివారించడం కోసం ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి వాటి పని తీరును వివరించారు. అగ్నిమాపక వాహన పరిస్థితిని సీఈ అడిగి తెలుసుకున్నారు. కేంద్రం సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఏడీఈ రాము, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో సైబర్ మోసం

పలువురి బ్యాంకు ఖాతాల్లో నగదు మాయం

కందనూలు: సైబర్ నేరగాళ్ల చేతిలో పడి పలువురు మోసపోయిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గంలోని పలువురు వ్యక్తుల బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు మాయం చేయడంతో శుక్రవారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన బాలరాజు రూ.9వేలు, అశోక్ రూ.20వేలు, యాదగిరిరావు రూ.7వేలు, మల్లికార్జున్ రూ.16వేలు, మంగనూర్ చెందిన కృష్ణయ్య రూ.20,500లతో పాటు మరికొందరికి చెందిన నగదు డ్రా అయినట్లు బాధితులు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏటీఎం కార్డులు, ఏదైనా మెసేజ్‌లు ఫోన్‌కు వస్తే స్పందించకూడదని, అనుమానం వస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం


ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితోసమావేశమైన కేంద్ర బృందం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జాతీయ నాణ్యతా ప్రమాణాల అధికారులు శిల్పామన్‌చండ, అంకూర్ సూడెన్ సందర్శించాఉ. వారు ఆరోగ్య కేంద్రంలోని ప్రసూతి విభాగం, జనరల్ చెకప్, వ్యాక్సినేషన్, వ్యాధి నిర్ధారణ, ఆయుర్వేద విభాగాలపై మెడికల్ ఆఫీసర్స్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయా విభాగాల్లో వారు పరిశీలించి మార్కులు ఇస్తారని వాటిలో 75 శాతం దాటితే కేంద్రం నిధులు మంజూరు చేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం సైతం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గద్వాల మండలం గోనుపాడులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుర్వ వెంకటమ్మ భర్త కుర్వ రామస్వామి మధ్య కొంతకాలంగా విభేధాలు నెలకొన్నాయి. శుక్రవారం ఇరువురు గొడవ పడగా, తీవ్ర మనస్తాపం చెందిన కుర్వ వెంకటమ్మ ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వారి కుటుంబ సభ్యులకు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన వాహనం

పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి నుంచి కొల్లాపూర్‌కు బొలెరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పక్కా సమాచారంతో బుడిదపాడు, అయ్యవారిపల్లి మధ్య శుక్రవారం ఉదయం 6 గంటలకు పోలీసులు వాహనాలు తనిఖీ చేసి పట్టుకుఅన్నరు. వాహనంలో సుమారుగా 43 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ హరిజన్ రవి అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఆత్మకూర్ మండలం గుంటిపల్లికి చెందిన క్లీనర్ రాజు దొరకడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

కాశీకి వెళ్లి వస్తూ.. గుండెపోటుతో మృతి

- రైలులో వస్తుండగా జనగామ వద్ద ఘటన
- నిజాలాపూర్‌లో విషాదం


భీమయ్యసాగర్(ఫైల్)

అడ్డాకుల: కాశీ పుణ్యక్షేత్రానికి భార్యతో కలిసి వెళ్లిన భర్త మరి కొన్ని గంటల్లో ఇంటికి చేరుకుంటారనుకున్న సమయంలో గుండెపోటుకు గురై రైలులోనే ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటనతో మూసాపేట మండలం నిజాలాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోత్కాయల భీమయ్యసాగర్(55) ఆయన భార్య రామేశ్వరమ్మ ఈనెల 2న బంధువులతో కలిసి కాశీ పుణ్యక్షేత్రానికి రైలులో వెళ్లారు. దర్శనం తర్వాత చుట్టు పక్కల ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని రైలులో తిరుగు ప్రయాణమయ్యారు. గురువారం రాత్రి 7:30గంటల సమయంలో జనగామ వద్ద రైలులో బాత్‌రూంకు వెళ్లాడు. అందులోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. భార్య బాత్‌రూం వద్దకు వెళ్లి డోర్ కొట్టినా స్పందన రాలేదు. బంధువులను పిలవడంతో అందరూ కలిసి సుమారు 45 నిమిషాలు శ్రమించి తలుపు తీశారు. భీమయ్య మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ మరి కొందరితో కలిసి భువనగిరికి వెళ్లి శవపరీక్షలు నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని మధ్యాహ్నం గ్రామానికి తీసుకొచ్చారు. సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. తండ్రి శవమై రావడంతో ముగ్గురు కుమార్తెల రోధనలు కంటతడి పెట్టించాయి.

ఆరు తులాల బంగారం చోరీ

వనపర్తి క్రైం: ఆటోలో వెళ్తున్న మహిళ సంచిలో నుంచి బంగారు ఆభరణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణ రెండో ఎస్‌ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండలం బుద్దారం చెందిన స్వర్ణమ్మ గురువారం మధ్యాహ్నం జిల్లా కేంద్రానికి వచ్చింది. అనంతరం గాంధీచౌక్‌లోని ఓ దుకాణంలో తాను చేయించిన ఆరు తులాల బంగారు ఆభరణాన్ని తీసుకుని, గాంధీచౌక్ నుంచి రాజీవ్‌చౌరస్తాకు ఆటోలో బయలుదేరింది. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రహదారులు రక్తసిక్తమయ్యాయి. నారాయణపేటలో తాతా, మనవడు, జడ్చర్లలో ఇద్దరు యువకులు, శాంతినగర్‌లో ఆటో బోల్తా పడి డ్రైవర్, పాన్‌గల్‌లో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి మహిళ, దేవరకద్రలో రోడ్డు దాటుతుండగా మరొకరు మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో పలువురికి గాయాలై చికిత్స పొందుతున్నారు.

చోరీ చేసిన బైక్‌పై వస్తూ..

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాలకు చెందిన బీసం శివసాగర్(19), సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం తాలెల్మ గ్రామానికి చెందిన షాబాద్ నవీన్(20) బైక్‌పై కర్నూల్ వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. మల్లెబోయిన్‌పల్లి వద్ద రోడ్డు క్రాస్ చేసే సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న షాబాద్ నవీన్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడిన బీసం శివసాగర్‌ను అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీసం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతిచెందిన ఇద్దరు కూలీ, సెంట్రింగ్ పనులు చేస్తుండేవారని తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో వారి ఆచూకి కనుగొనే సమయంలో పోలీసులు బైక్‌నంబర్ టీఎస్ 07ఎఫ్‌క్యూ4359కు సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు సేకరించారు. బైక్ యజమాని నంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడగా, సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిగూడలో బుధవారం తన బైక్ చోరీకి గురైందని తెలిపినట్లు పోలీసులు తెలిపారు. మృతులు ఇద్దరూ బైక్‌ను చోరీ చేసి ఇక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు.


జడ్చర్లలో జాతీయరహదారిపై బైక్

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాపూనగర్‌కు చెందిన సోమరి శంకరప్ప (62) సింగారం గేట్ సమీపంలోని ద్వారక స్కూల్‌లో వాచ్‌మన్‌గా డ్యూటీ చేస్తున్నాడు. గురువారం రాత్రి సైతం విధులకు తనతో పాటు మనుమడు వరుణ్ (8)ను తీసుకుని లూనా పై వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం అతివేగంగా ఢీకొట్టింది. శంకరప్ప తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వరుణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ సంఘటనపై ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా..

మరికల్: మండలంలోని మాధవరం చెందిన బాలనర్సమ్మ (55) గురువారం దేవరకద్రలో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి మహిళ..


పాన్‌గల్‌లో బోల్తాపడిన ట్రాక్టర్

పాన్‌గల్: కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లికి చెందిన తెలుగు మొగులమ్మ(35) కూలీ పనుల నిమిత్తం గురువారం మండలంలోని అన్నారంతండాకు ట్రాక్టర్‌పై వెళ్లింది. పనులు ముగించుకుని ఇతర కూలీలతో కలిసి ట్రాక్టర్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో తండా సమీపంలో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. మొగులమ్మకు తీవ్ర గాయాలు కావడం, మిగతా కూలీలు భారతమ్మ, భాగ్యమ్మ, శేఖర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే మొగులమ్మను అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఆటో డ్రైవర్ దుర్మరణం


వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో బోల్తాపడిన ఆటో


పరశురామ్‌గౌడ్ (ఫైల్)

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాధాస్వామి సత్సంగ్ సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రాజోళి మండలం పెద్ద తాండ్రపాడు చెందిన ఈడిగ పరశురామ్‌గౌడ్ (28) గురువారం సాయంత్రం 4గంటలకు స్వగ్రామం నుంచి ప్రయాణికులతో తన ఆటోలో గ్రామానికి చెందిన కమ్మరి రవితో పాటు వయా శాంతినగర్-కర్నూలు వైపు బయల్దేరాడు. రాత్రి 11 గంటల సమయంలో ఆటోలో వెళ్లిన రవి ఫోన్‌చేసి పరశురామ్‌గౌడ్ నడుపుతున్న ఆటో బోల్తాపడిందని తండ్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సమాచారం అందించాడు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు కొన ఊపిరితో ఉన్న పరశురామ్‌గౌడ్‌ను వెంటనే కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతిచెందాడు. తన కుమారుడు ఆటోను అజాగ్రత్తగా నడపడం వల్లే అదుపుతప్పి ఆటో కింద పడి ఉంటుందని తండ్రి ఫిర్యాదులో పేర్కొనగా, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా

ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...



మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

● గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

● నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

● ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రోలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.



● గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. ● కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.

చర్మ సంరక్షణ ముఖ్యం

● వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.

● ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకు వెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండాకాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.

● వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి. ● ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి. ● అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు. ● కర్బూజా, పుచ్చ కాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది. ● వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంభై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

● ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, భారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు. ● పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.



● ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి డయాక్సిన్ లాంటి టాక్సిన్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ డయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్ల తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు. బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

● మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.

● ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

● ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

● ప్రెషర్ కుకర్ బెస్ట్: ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.

● చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.

● బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.

● వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపి వేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.

● వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్ల వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.

● పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది. ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● కమల్‌హాసన్


● ప్రభాస్



● అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్

● రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.

● ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

● లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.


● రణ్‌బీర్ కపూర్


● శర్వానంద్

● బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.

సమ్మర్ బ్రేక్


● మహేశ్‌బాబు


● రామ్‌చరణ్


● ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్

'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.


● పూజా హెగ్డే


భావోద్వేగాల విమానం


● ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ని జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?

హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వరకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.


● యశ్


● గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్నీ కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ప్రచండ తరుణం షురూ


● రితికా, అశోక్, శ్రష్టి

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రష్టి వర్మ, వినయ్ బిద్దప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కారిన్య కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక–నిర్మాతలు.